సాక్షి ప్రకాశం

శనివారం । 11 । జనవరి । 2025

I



ట్రాక్టర్ ఢీకొని ఒకరు దుర్మరణం

మోటారు సైకిల్‌ను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. టీడీపీ పెద్దల అండతోనే హత్య చేశారని బంధువులు ఆరోపిస్తున్నారు.

- IIలో..



నేల'పాలు'

మిల్క్ ట్యాంకర్ బోల్తాపడి రూ.3 లక్షల విలువైన పాలు నేలపాలయ్యాయి. ముండ్లమూరు మండలం వేంపాడు సమీపంలో ఈ ఘటన జరిగింది.

- IIలో..

గరిష్టం/కనిష్టం
28/21

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

13న జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యర్రగొండపాలెంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి శుక్రవారం తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 13న ఈ పోటీలు ప్రారంభమవుతాయని, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నంలోపు తమ టీంపేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. విజేత టీంకు ప్రథమ బహుమతి కింద రూ.50 వేలు, రెండో బహుమతి రన్నరప్, బెస్ట్ బ్యాట్స్ మెన్, బెస్ట్ బౌలర్, మ్యాన్‌ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్‌ఆఫ్ ద సిరీస్‌లు ఉంటాయని ఆయన తెలిపారు. ఫోన్ నంబర్లు: 88864 22114, 96765 31818, 94411 26023 సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు.

కొత్త జూనియర్ కాలేజీలకు 31లోపు దరఖాస్తులివ్వాలి

ఒంగోలు సిటీ: కొత్తగా జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలనుకునే యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు ఈనెల 31వ తేదీ తుది గడువుగా ఇంటర్మీడియెట్ విద్యా మండలి కార్యదర్శి నిర్ణయించినట్లు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఏ.సైమన్ విక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏ.సైమన్ విక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాళ్లూరు, కొత్తపట్నం, పుల్లలచెరువు, వెలిగండ్ల, కురిచేడు మండలాల్లో మాత్రమే కొత్త కళాశాలలు ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తారని తెలిపారు. 2025–2026 విద్యా సంవత్సరానికి ప్రస్తుతం నడుపుతున్న ప్రైవేటు జూనియర్ కళాశాలల అఫిలియేషన్, అదనపు సెక్షన్లు, అదనపు కోర్సులు, కళాశాల షిఫ్టింగ్, మేనేజ్‌మెంట్ మార్పు, కోర్సుల కన్వర్షన్, మూతపడిన కళాశాలను పునఃప్రారంభం సర్వీసులకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల తుది గడువును ఫిబ్రవరి 28 గా నిర్ణయించినట్లు తెలిపారు. తదుపరి తుది గడువులను పొడిగించేది లేదన్నారు. అన్ని రకాల దరఖాస్తులను ఉద్దేశించిన గడువులోపు ఆన్‌లైన్ ద్వారా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి డీఈఓ హామీ

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి డీఈఓ కిరణ్‌కుమార్ హామీ ఇచ్చినట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జనార్దన్ రెడ్డి, డి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరు లోపు సమస్యలన్నీ పరిష్కరిస్తామని డీఈఓ రాతపూర్వకంగా హామీ ఇచ్చారన్నారు. డీఈవోను కలిసిన వారిలో పూర్వ రాష్ట్ర కార్యదర్శి రఘుబాబు, జిల్లా సబ్ కమిటీ సభ్యులు శేఖర్‌రెడ్డి, శేషారావు, హనుమంతరావు, లేవిప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు మల్లిఖార్జునరావు, నాగేశ్వరరావు ఉన్నట్లు చెప్పారు.

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

ఒంగోలు సిటీ: గుర్తింపు కార్డులున్న కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వేశపోగు బాలకోటయ్య కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలకోటయ్య, లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్ తో పంట రుణాలపై శుక్రవారం సంప్రదింపులు జరిపారు. ఈ సందర్భంగా బాలకోటయ్య మాట్లాడుతూ ఖరీఫ్ పూర్తయినా కౌలు రైతుల పట్ల బ్యాంకర్లు ఉదాసీనంగా ఉన్నారన్నారు. కనీసం రబీ సీజన్ కైనా గుర్తింపు కార్డులున్న కౌలుదారులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకర్లు పంట రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆశించిన దిగుబడి రాక, గిట్టుబాటు ధర లభించక కౌలు రైతు కుదేలవుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో కౌలు రైతును ఆదుకునేందుకు జోక్యం చేసుకోవాలని కోరారు.

వ్యవసాయ అధికారుల సంఘ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ అధికారుల సంఘం 2025 డైరీని శుక్రవారం ప్రకాశం భవనలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. వ్యవసాయ అధికారులు రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. దీంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, డీడీఏ సుబ్రహ్మణ్యేశ్వరరావు, గోపిచంద్, శ్రీనివాసనాయక్, కిషోర్‌బాబు, హరికృష్ణ పాల్గొన్నారు.
– నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. ఆ మేరకు అక్షర వెలుగులు పేరుతో రూపొందించిన పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. దీనిలో వయోజన విద్య శాఖ ఉపసంచాలకులు వెంకటేశ్వరరావు, డీపీఓ వెంకటనాయుడు పాల్గొన్నారు.



ఒంగోలులోని శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

వైకుంఠ వాసా..

సద్గతి ప్రదాతా

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం జిల్లాలోని వైష్ణవాలయాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. వేకువజాము నుంచే ఉత్తర ద్వారంగుండా వైకుంఠ వాసుని దర్శనం చేసుకునేందుకు భక్తజనం బారులు తీరారు. గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉపవాస దీక్షలతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. - సాక్షి నెట్‌వర్క్



శ్రీగిరిలో స్వామివారి ఉత్సవమూర్తులు

జిల్లాలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గ్రానైట్ పరిశ్రమ కుదేలవుతోంది. ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడంతో ఆర్థిక సంక్షోభం నెలకొంది. క్వారీ యజమానుల కుట్రలు ఒక వైపు.. సిండికేట్ అవుతున్న బయ్యర్లు.. ఫలితంగా పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకమైంది. ఇప్పటికే 400 పరిశ్రమలు మూతపడ్డాయి. దీనినే నమ్ముకున్న వేలాది మంది కార్మికులు వలసబాట పట్టారు. ఇలాగే కొనసాగితే ఆత్మహత్యలే శరణ్యమని ఫ్యాక్టరీల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గ్రానైట్ క్వారీల యజమానుల కుతంత్రాలు

ఫ్యాక్టరీలకు నాణ్యమైన గ్రానైట్ రాళ్లను అందించటంలో క్వారీల యజమానుల కుతంత్రాలు అన్నీ ఇన్నీ కావు. గ్రానైట్ క్వారీలో తీసే రాళ్లకు చెల్లించాల్సిన రాయల్టీని క్వారీ యజమానులు కటింగ్ ఫ్యాక్టరీల యజమానుల వద్ద నుంచే వసూలు చేస్తున్నారు. అలా అయితేనే రాళ్లు ఇస్తామంటారు. పోనీ అవైనా సక్రమంగా ఇస్తున్నారా..? అంటే అదీ లేదు. క్రాక్‌లు, లైన్‌లు లేకుండా ఉన్న రాళ్లను మీటరుకు అదనంగా మరో మీటరును ఉచితంగా కలిపి ఎగుమతులకు ఇస్తారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించే ఫ్యాక్టరీలకు మాత్రం పగుళ్ల, క్రాక్‌లు, లైన్‌లు ఉన్న నాసిరకం రాళ్లను లాట్‌లుగా ఏర్పాటు చేసి పగుళ్ల రాళ్లను కిందపెట్టి క్వారీ యజమానులు నిర్ణయించిన ధరలకే ఫ్యాక్టరీల యజమానులు తీసుకుపోవాలి. పగుళ్ల రాళ్లు ఉంటే ఆ లాట్‌కు పెట్టిన డబ్బులు గోవిందా...కటింగ్ చార్జీలు, లేబర్ ఖర్చులు కూడా రావడం లేదని ఫ్యాక్టరీల యజమానులు వాపోతున్నారు. మరి కొంత మంది క్వారీ యజమానులు ఇంకొక అడుగు ముందుకేసి కొనుగోలు చేసే వారందరినీ చుట్టూ కూర్చోబెట్టి సెల్‌ఫోన్‌ల ద్వారా మెసేజీలు పెట్టించి ఎవరు ఎక్కువ కోట్ చేస్తే వారికే ఇస్తామంటూ ఫ్యాక్టరీల యజమానుల మధ్య కృత్రిమ పోటీ కల్పించి క్వారీ యజమానులు నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని ఫ్యాక్టరీ యజమానులు ఆరోపిస్తున్నారు.

- రాయితీలు ఇవ్వని ప్రభుత్వం
- సిండికేట్ అవుతున్న బయ్యర్లు
- నడ్డి విరుస్తున్న క్వారీ యజమానులు
- ప్రభుత్వం నుంచి రాని సబ్సిడీ
- 400 గ్రానైట్ ఫ్యాక్టరీల మూత
- ఆత్మహత్యలే శరణ్యమంటున్న ఫ్యాక్టరీల నిర్వాహకులు

ఖ్యాతి మసకబారి.. రాయితీ బండబారి

చీమకుర్తి: ప్రపంచ ప్రసిద్ధి చెందిన గెలాక్సీ గ్రానైట్‌కు కేరాఫ్ అడ్రస్ చీమకుర్తి. రామతీర్థం, బూదవాడ, యల్లయ్యనగర్, మర్రిచెట్లపాలెంతో పాటు సంతనూతలపాడు, మద్దిపాడు మండలంలోని గ్రోత్‌సెంటర్, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మార్టూరు, బల్లికురవ ప్రాంతాల్లో సుమారు 2 వేల గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటిని నమ్ముకుని లక్షలాది మంది కార్మికులు జీవిస్తున్నారు. కరోనా నుంచి అంతంత మాత్రంగా ఉన్న గ్రానైట్ ఎగుమతులు నెమ్మదిగా పుంజుకుంటున్నాయి. ఈ తరుణంలో క్వారీ యజమానులు, బయ్యర్లు, రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు, మైన్స్ అధికారులు దాడులు చేస్తుండడంతో పరిశ్రమల నిర్వాహకుల పరిస్థితి దారుణంగా మారింది.

మాట తప్పిన కూటమి నేతలు

ఎన్నికల ముందు గ్రానైట్ పరిశ్రమకు అండగా నిలుస్తామని కూటమి అగ్రనేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆమాటను మరిచిపోయారు. ఎంత ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తే అంత ఎక్కువ రాయితీలు ఇస్తామన్నారు. 100 రోజుల్లో సబ్సిడీలు ఇస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. పరిశ్రమల శాఖామంత్రి కూడా త్వరలో సబ్సిడీలు ఇస్తామని చెప్పి కూడా రెండు నెలలు దాటింది. కరెంటు బిల్లులు తగ్గిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులకు భరోసా ఇచ్చారు. కానీ ఇంత వరకు కరెంటు బిల్లులు నయాపైసా తగ్గించకపోగా ట్రూఅప్ పేరుతో చార్జీలు పెంచేశారు. సబ్సిడీలు ఎప్పుడు వేస్తారా అంటూ గ్రానైట్ యజమానులు ఐదారు నెలల నుంచి ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి సహకారం కరువవడంతో దాదాపు 400 గ్రానైట్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. కరెంటు బిల్లులు చెల్లించకపోవడంతో సుమారు 150 ఫ్యాక్టరీలకు కరెంటు కనెక్షన్‌లను విద్యుత్ శాఖాధికారులు తొలగించారు. బ్యాంక్ రుణాలు తెచ్చుకున్న వారికి సబ్సిడీ రావాల్సిన ఫ్యాక్టరీలు సుమారు 250కి పైగా ఉన్నట్లు అంచనా. సబ్సిడీలు రాక, కరెంటు బిల్లులు కట్టలేక, బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్న ఫ్యాక్టరీల యజమానులకు ఆత్మహత్యలే శరణ్యమన్నట్లుగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిండికేట్ అవుతున్న బయ్యర్లు

బయ్యర్లు సిండికేట్ అయి ఫ్యాక్టరీల యజమానులను నష్టాలపాలు చేస్తున్నారు. అడుగుకు రూ.5 నుంచి రూ.15 మేర తగ్గించి ఫ్యాక్టరీల యజమానుల నడ్డి విరుస్తున్నారు. ఇప్పటికే కరెంటు బిల్లుల భారం, జీతాలు, రుణాలకు సంబంధించి నెల వాయిదాల భారం తట్టుకోలేక యజమానులు విలవిల్లాడిపోతున్నారు. ప్రతి నెలా రూ.50 వేల నుంచి రూ.లక్షల్లో నష్టాలను భరిస్తూ స్లాబులను అమ్ముకోవాల్సి వస్తోంది. మెట్లకు వాడే 3 సెం.మీ స్లాబులను కట్ చేసే ఫ్యాక్టరీలు జిల్లాలో 150 వరకు ఉన్నాయి. ఆయా ఫ్యాక్టరీల యజమానుల వద్ద 3 సెం.మీ స్లాబులను కొనుగోలు చేయకుండా జిల్లాలోని అధికార పార్టీ నాయకుడి అండదండలతో నలుగురు బయ్యర్‌లు కలిసి వారు చెప్పిన రేటుకే ఇవ్వాలని, లేకుంటే స్లాబులు తీసుకుపోయేది లేదంటూ హుకుం జారీ చేస్తున్నారు. వీటికి తోడు రాజకీయ ఒత్తిళ్లతో మైన్స్ అధికారులు, పోలీసులు చేస్తున్న దాడులు ఫ్యాక్టరీల యజమానులను మరింత కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఇటీవల పేర్నమిట్ట, సంతనూతలపాడు, చీమకుర్తి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్న దాదాపు 50 కంటైనర్లు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతోనే జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి.

ఊరెళ్లిపోతున్న కార్మికులు

ఒక్క షిఫ్ట్ కూడా నడపలేక ఇప్పటికే 400కు పైగా ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. కనీసం రెండు షిఫ్ట్‌లలో పనిచేస్తే గాని అందులో పనిచేసే కార్మికులకు జీతాలు గిట్టుబాటు కావు. ఒకప్పుడు 20 వేల మంది కార్మికులు పనిచేసే చోట 5 వేల మంది కూడా పనిచేయడంలేదు. దీంతో పనుల్లేక కార్మికులు ఊరెళ్లిపోతున్నారు. ఇంతటి కష్టకాలంలో ఫ్యాక్టరీలను నడపడం చాలా కష్టంగా ఉందని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి కరెంటు బిల్లులు తగ్గించటం, రాయల్టీ భారం ఫ్యాక్టరీలపై లేకుండా చేయటం, ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీలు (ప్రోత్సాహకాలు) త్వరగా ఇస్తే గ్రానైట్ ఫ్యాక్టరీలు కొంతకాలం పాటు మనుగడ సాగిస్తాయని యజమానులు అంటున్నారు.

ప్రభుత్వం రాయితీలివ్వాలి..



ప్రభుత్వం స్పందించి త్వరగా ఇవ్వాల్సిన ప్రోత్సాహాలు అందిస్తే గ్రానైట్ ఫ్యాక్టరీల పరిశ్రమ కోలుకునే అవకాశం ఉంది. గ్రానైట్ క్వారీల నుంచి స్థానికంగా ఉన్న ఫ్యాక్టరీలకు నాణ్యమైన గ్రానైట్ మెటీరియల్ ఇవ్వాలి. దాని వలన వేలాది మంది కార్మికులకు ఉపాధి అవకాశాలను ఫ్యాక్టరీల ద్వారా కల్పించే అవకాశం ఉంటుంది.

- చల్లా రవి, ఫ్యాక్టరీ యజమాని

పేదలకు ఇళ్ల స్థలాలు ఎక్కడ..?

- పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్ల చొప్పున నివేశిత స్థలాలు ఇవ్వాలి
- సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మహాధర్నాలో వక్తలు



కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొని మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఒంగోలు సిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల హామీలో భాగంగా అర్హులైన పేదలకు ఇస్తానన్న నివేశిత స్థలాలను వెంటనే మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితుల పిలుపు మేరకు పేదలకు నివేశిత స్థలాలు ఇవ్వాలని, భూమిలేని పేదలకు సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు చొప్పున నివేశిత స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తానని చెప్పారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ మేరకు జిల్లాలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి నివేశిత స్థలం ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షల వంతున మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఒంగోలు నగరంలో గత ప్రభుత్వం 22 వేల మంది పేదలకు నివేశిత స్థల అర్హత పత్రాలను అందజేశారన్నారు. అనర్హుల పేరుతో లబ్ధిదారుల లిస్టును రద్దు చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోమన్నారు. లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. గత 20 సంవత్సరాలుగా సరళాదేవి నగర్‌లో, గత 12 సంవత్సరాలుగా కార్మిక నగర్‌లో, గత 18 సంవత్సరాలుగా దత్తాత్రేయ కాలనీలో నివాసం ఉంటున్న పేదలకు వెంటనే ఇంటి పట్టాలు మంజూరు చేయాలన్నారు. అలాగే పేదలు నివశించే ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను చంద్రబాబు కట్టుబడి అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీహెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఇల్లు, కూడు, గుడ్డ, ఉపాధి అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే నరసయ్య, ఆర్.రామకృష్ణ, సయ్యద్ మౌలాలి, పి.ప్రభాకర్, ఎం.విజయ, రావమ్మ, లక్ష్మీ, రామారావు, సర్దార్, గద్దల రవి, ఒంగోలు నగర సహాయ కార్యదర్శి శ్రీరామ శ్రీనివాసరావు, ఏ.సలార్, లక్ష్మయ్య, కైలా అజయ్ పాల్గొన్నారు.

ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు

- పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షలకు 2174 మంది ఎంపిక
- 3256 మంది హాజరు
- చివరి రోజు భారీగా హాజరైన అభ్యర్థులు



రన్నింగ్ టెస్ట్‌లో పాల్గొన్న అభ్యర్థులు

ఒంగోలు టౌన్: పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. గత ఏడాది డిసెంబర్ 30 నుంచి జనవరి 10 వరకు జరిగిన ఈ దేహదారుఢ్య పరీక్షలకు మొత్తం 5,435 మంది హాజరుకావాల్సి ఉండగా 3,256 మంది హాజరయ్యారు. 2,174 మంది తదుపరి రాత పరీక్షలకు ఎంపికయ్యారు. చివరి రోజు 430 మంది హాజరు కాగా 226 మంది క్వాలిఫై అయ్యారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్టేట్ లెవెల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నియమ నిబంధనల ప్రకారం పరీక్షలను పూర్తి పారదర్శకంగా నిర్వహించారు. ఈ ఎంపిక ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ ఏఆర్ దామోదర్ ఎలాంటి అవకతవకలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. క్రమం తప్పకుండా పరీక్షలకు హాజరవడంతో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో ఆద్యంతం ప్రక్రియపై నిఘా పెట్టారు. దేహదారుఢ్య పరీక్షలు జరిగే సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్య తలెత్తినా వెంటనే వైద్య చికిత్స అందించేందుకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

అధికారులు, సిబ్బందికి అభినందనలు...

పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియ విజయవంతం కావడానికి పోలీస్ అధికారులు, సిబ్బంది నిబద్ధతగా పనిచేశారని ఎస్పీ దామోదర్ అభినందించారు. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉద్యోగం సాధించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కే.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, పీటీసీ డీఎస్పీలు లక్ష్మణ్ కుమార్, మాధవ రెడ్డి, ఎస్బీ డీఎస్పీ సురేష్ బాబు, డీపీవో ఏవో రామ్మోహన రావు, డీటీసీ సీఐ షేక్ షమీవుల్లా, పీటీసీ సీఐ శ్రీనివాసరావు, ఐటీ కోర్ సీఐ సూర్యనాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ చేతిలోకి సహకార రంగం

- వేతన సవరణ చేపట్టాలి
- పీడీసీసీ బ్యాంకు ముందు ధర్నా చేపట్టిన సహకార సంఘాల ఉద్యోగులు




ధర్నా చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ నాయకులు

ఒంగోలు సబర్బన్: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వ విధానం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార రంగం కార్పొరేట్ చేతిలోకి వెళ్లే ప్రమాదం ఉందని రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామాంజి రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక పోస్టాఫీస్ సెంటర్‌లో పీడీసీసీ బ్యాంకు కేంద్ర కార్యాలయం ముందు యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు కే.సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో సహకార సంఘాల ఉద్యోగుల పట్ల టీడీపీ కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రామాంజి రెడ్డి మాట్లాడుతూ జీఓ 36ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2019 నుంచి 2024 వరకు వేతన సవరణ చేపట్టాలన్నారు. ఉద్యోగుల వయోపరిమితి వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. రాష్ట్ర యూనియన్ ఉపాధ్యక్షుడు పి.హనుమంతరావు మాట్లాడుతూ డీఎల్‌ఎఫ్ ఏర్పాటు చేయాలన్నారు. 2019 మార్చి 1 తరువాత ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీని చట్ట ప్రకారం అమలు చేయాలన్నారు. డ్యూటీ పద్దులను రద్దు చేయాలని, ఆడిట్ డ్యూయల్ పద్ధతిని కూడా రద్దు చేయాలని కోరారు. షేర్ ధనంపై డివిడెండ్లు చెల్లించాలని, సహకార సంఘాలకు అన్నిరకాల రుణాలు మంజూరు చేయాలన్నారు. డీసీసీబీ డైరెక్ట్ రుణాలు నిలుపుదల చేయాలని కోరారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం పీడీసీసీ బ్యాంకు సీఈఓకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో యూనియన్ నాయకులు ఎంపి.మల్లిఖార్జున రావు, ఎస్.కృష్ణ చైతన్య, పీఎల్ రంగయ్య, ఆర్.రమణారెడ్డి, కే.రామిరెడ్డి, ఎస్.రమేష్, పీ.శ్రీనివాస రెడ్డి, ఏ.అంజిరెడ్డి పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా ప్రభుత్వం

- మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి



మంత్రి స్వామితో కలిసి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే

మద్దిపాడు: పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ డోల బాల వీరాంజనేయ స్వామి అన్నారు. మద్దిపాడులో ఒక రైతు నిర్మించుకున్న మినీ గోకులం షెడ్డును శుక్రవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులతో రోడ్లు, కాల్వలు, చెక్ డ్యాములు, పశువులకు గోకులం షెడ్లు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. జిల్లాకు 1131 షెడ్లు మంజూరయ్యాయని, 1040 షెడ్లు ప్రారంభించామని, 474 షెడ్లు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలినవి కూడా త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని, కొత్త షెడ్లు కూడా మంజూరు చేస్తామని ప్రకటించారు. రెండు పశువులు ఉన్న వారికి రూ.1.15 లక్షలు, నాలుగు పశువులు ఉన్న వారికి రూ.1.85 లక్షలు, ఆరు పశువులు ఉన్నవారికి రూ.2.30 విలువైన మినీ గోకులం షెడ్లను 90 శాతం రాయితీతో మూడు క్యాటగిరీలుగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది చెప్పారు. కార్యక్రమంలో ఆయన వెంట పశుసంవర్ధక శాఖ జేడీ బేబీ రాణి, డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, డీపీవో వెంకట్ నాయుడు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, తహసీల్దార్ సుజన్ కుమార్, మద్దిరాల వెంకటేశ్వర్లు, మండల టీడీపీ అధ్యక్షుడు జయంతి బాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పూరిమెట్ల జెడ్పీ హైస్కూల్‌కు మూడెకరాలు

● జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లికి గ్రామస్తుల కృతజ్ఞతలు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పూరిమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మూడు ఎకరాల స్థలాన్ని మంజూరు చేయించారు. గతేడాది ఆ పాఠశాలకు తనిఖీ కోసం వెళ్లగా విద్యార్థులు చెట్ల కింద కూర్చుని పాఠాలు చదువుకోవడం చూసి ఆమె చలించిపోయారు. ఆ మేరకు ఆ రోజే పాఠశాలకు స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వెంటనే స్థలాన్ని మంజూరు చేయాలని అప్పటి కలెక్టర్ దినేష్ కుమార్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. ఎన్నికల కోడ్ రావడంతో ఫైల్ ముందుకు సాగలేదు. ఆ తర్వాత అధికారులు పాఠశాలకు మూడు ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. స్థలాన్ని క్లాస్ రూమ్‌లు, ఆట స్థలానికి ఉపయోగించుకోనున్నారు. దీంతో గ్రామస్తులు, విద్యార్థులు బూచేపల్లి వెంకాయమ్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన ఈఓ



త్రిపురాంతకం: మండల కేంద్రం త్రిపురాంతకం బాలసుందరీదేవి, పార్వతి త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల నూతన ఈఓగా డి. రజనీకుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈఓగా పని చేసిన చెన్నకేశవ రెడ్డి బదిలీపై వెళ్లారు. ఆమెను కలిసిన వారిలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఇమ్మిశెట్టి సుబ్బారావు, ఆర్యవైశ్య అన్నదాన సత్రం నిర్వాహకులు అనుమలశెట్టి సుబ్బారావు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

ఆదివాసీల జీవితాల్లో వెలుగులు

● విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



గిరిజనులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

పెద్దదోర్నాల: ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మొట్ల మల్లికార్జునపురం గిరిజన గూడెంలో ఆయన చెంచు గిరిజనులతో మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. తమ గూడెల్లో ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూములను గుర్తించి వాటికి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. దీంతో పాటు పలు గూడేల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. దీంతో మంత్రి మాట్లాడుతూ విద్యుత్ లేని 1750 ఆదివాసీల గృహాలను గుర్తించి వాటిలో 956 గృహాలకు విద్యుత్ సరఫరా కల్పించినట్లు తెలిపారు. టైగర్ రిజర్వు ఫారెస్టులోని 611 కుటుంబాలకు సోలార్ కనెక్షన్లు ఇప్పించినట్లు చెప్పారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.



ఒంగోలు : ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయంలో..



మార్కాపురం : ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న లక్ష్మీచెన్నకేశవస్వామి





పామూరులో మదన వేణుగోపాలస్వామి ఆలయం వద్ద భక్తుల క్యూ (ఇన్‌సెట్‌లో) విశిష్ట అలంకరణలో స్వామివారు



కొనకనమిట్ల : ప్రత్యేక అలంకారంలో వెలుగొండ వెంకటేశ్వరస్వామి



ఒంగోలు : శ్రీగిరిపై వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్త జనం



రాచర్ల : నెమలిగుండ్ల రంగనాయకస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



సింగరాయకొండ : ఉత్తర ద్వారంలో వరాహ లక్ష్మీనరసింహస్వామి



పెద్దారవీడు : తిరుమలనాథస్వామి కళ్యాణంలో పాల్గొన్న భక్తులు



గిద్దలూరు షరాబ్ బజార్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో..



బేస్తవారిపేట త్రిలోక పుణ్యక్షేత్రంలో కోలాట ప్రదర్శన



దర్శి కోదండరామాలయంలో భక్తుల భజనలు

'ముక్కోటి' దండాలు

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని శుక్రవారం జిల్లాలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అన్ని ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల మూల విగ్రహమూర్తులను విశిష్టంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులను పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ రోజున స్వామివారిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయన్న విశ్వాసంతో భక్తులు ఆలయాలకు పోటెత్తారు. వేకువజాము నుంచే ఆలయాల వద్ద రద్దీ ఏర్పడటంతో దేవదాయశాఖ అధికారులు, నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

ట్రాక్టర్ ఢీకొని ఒకరు దుర్మరణం?

● టీడీపీ పెద్దల అండతోనే హత్య చేశారని బంధువుల ఆరోపణ
● మృతుడు వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు
● కొనకనమిట్ల మండలం వాగుమడుగులో ఘటన



మృతి చెందిన పెద్దచెన్నయ్య



సంఘటనా స్థలంలో వదిలి వెళ్లిన ట్రాక్టర్

కొనకనమిట్ల: మోటార్ సైకిల్‌ను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి కొనకనమిట్ల మండలం వాగుమడుగు సమీపంలో చోటుచేసుకుంది. అయితే ఇది ప్రమాదం కాదని, పాత కక్షలతోనే హత్య చేశారని మృతుడి బంధువులు ఆరోపించారు. అందిన సమాచారం మేరకు.. వాగుమడుగు గ్రామానికి చెందిన సాదం పెద్దచెన్నయ్య(40) పక్కనే అంబాపురంలో ఉంటున్న తన కుమార్తెను తీసుకొచ్చేందుకు బైక్‌పై బయలుదేరాడు. అదే గ్రామానికి చెందిన కదమ బుజ్జయ్య ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టడంతో ఎగిరిపడ్డాడు. ట్రాక్టర్ టైర్ మీదకు ఎక్కడంతో పెద్దచెన్నయ్య తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడు ట్రాక్టర్‌ను అక్కడే వదిలి పరారయ్యాడు. మృతుడు పెద్దచెన్నయ్యకు భార్య రమణమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు.

కుట్ర చేసి చంపారు

వాగుమడుగులో వైఎస్సార్ సీపీ కార్యకర్త అయిన పెద్ద చెన్నయ్యను టీడీపీ పెద్దల అండతో అదే పార్టీకి చెందిన కదమ బుజ్జయ్య ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపాడని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగితే తమకు సమాచారం ఇవ్వకుండా ట్రాక్టర్‌ను వదిలేసి ఎందుకు పారిపోయాడని బంధువులు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా కుట్రలో భాగమేనని పేర్కొంటూ సంఘటనా స్థలంలోనే మృతదేహాన్ని ఉంచి నిరసనకు దిగారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించేందుకు పోలీసులు యత్నించగా నిందితుడు బుజ్జయ్యను వెంటనే అరెస్ట్ చేసి నిజం నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

ఫార్మసి కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ అరెస్ట్



విద్యార్థినులను విచారిస్తున్న పోలీసులు

మద్దిపాడు: మండలంలోని ఏడుగుండ్లపాడు సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ ఫార్మసి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణ రాజశేఖర్‌ను లైంగిక వేధింపుల నేపథ్యంలో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని కళాశాలకు చెందిన కొందరు విద్యార్థినులు గురువారం రాత్రి మద్దిపాడు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణ రాజశేఖర్‌ను ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్, ఎస్సై శివరామయ్య విచారించారు. శుక్రవారం సాయంత్రం అరెస్టు చూపి, రిమాండ్‌కు తరలించారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

మార్కాపురం: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు తెలిపారు. వివరాలు.. గతేడాది ఆగస్టు 21న అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో అనంతపురం టౌన్‌లోని భవానీ నగర్‌కు చెందిన జానకొండ దామోదర్ ధర్మవరం నుంచి మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. ఆయన నిద్రపోతున్న సమయంలో ప్యాంటు జేబులో నుంచి గుర్తు తెలియని వ్యక్తి సెల్‌ఫోన్ తీసుకొని అందులో ఉన్న ఫోన్ నంబర్లకు తనకు అత్యవసరంగా డబ్బులు అవసరం అయ్యాయని మెసేజ్ చేశాడు. అది నమ్మిన వారు సుమారు రూ.50 వేలు పంపారు. ఈ విషయాన్ని గుర్తించిన దామోదర్ మార్కాపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మార్కాపురం మండలం కొండేపల్లి గ్రామానికి చెందిన మల్లె పద్మరాజును నిందితుడిగా గుర్తించారు. విచారణలో నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదం కాదది.. పక్కా హత్య

● పథకం ప్రకారమే టిప్పర్‌తో స్కూటీని ఢీకొట్టిన నిందితుడు
● క్షతగాత్రురాలి ఫిర్యాదుతో హత్య కేసుగా మార్పు

మార్కాపురం: మార్కాపురం మండలం కుంట-జమన్నపల్లి మధ్య గురువారం రాత్రి స్కూటీని టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో రాధ అనే యువతి అక్కడిక్కడే మృతి చెందగా, ఆమె అమ్మమ్మ ఈర్లపాటి సుబ్బలక్ష్మి తీవ్రగాయాలతో మార్కాపురం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అయితే ఇది ప్రమాదం కాదని తమను చంపేందుకు పక్కా పథకం ప్రకారం టిప్పర్‌తో తన మరిదే ఢీకొట్టాడని క్షతగాత్రురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు శుక్రవారం ప్రమాద కేసును హత్య కేసుగా మార్పు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలు, రూరల్ ఎస్సై అంకమరావు కథనం మేరకు.. మార్కాపురం మండలం కె.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఈర్లపాటి పెద్ద వెంకటేశ్వర్లు భార్య సుబ్బలక్ష్మి పట్టణంలోని అమ్మవారిశాల బజారులో టైలరింగ్ చేసుకుంటూ చుట్టుపక్కల గ్రామాల్లో దుస్తులు అమ్ముతూ జీవిస్తోంది. భర్త, మరుదులతో విబేధాలు రావడంతో గత కొన్నేళ్లుగా విడిగా ఉంటోంది. గురువారం సుబ్బలక్ష్మి తన అక్క మనుమరాలైన రాధను స్కూటీపై ఎక్కించుకుని కొత్తపల్లి గ్రామంలో దుస్తులు విక్రయించి ఇంటికి బయలుదేరింది. గురువారం రాత్రి కోలభీమునిపాడు సచివాలయం దగ్గర నుంచి స్కూటీని ఆమె మరిది చిన్న వెంకటేశ్వర్లు టిప్పర్‌తో వెంబడించాడు. జమ్మనపల్లి-కుంట మధ్య స్కూటీని ఢీకొట్టడంతో రాధ అక్కడికక్కడే మృతి చెందగా.. స్కూటీని టిప్పర్ కొంత దూరం ఈడ్చుకెళ్లింది. రాయవరం గురుకుల పాఠశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న రాధ సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిందని, ఇలా తమకు దూరమవుతుందని అనుకోలేదని తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో రూ.పది లక్షల పరిహారం

● నిందితుడికి ఏడాది జైలు

కనిగిరి రూరల్: వెలిగండ్ల మండలం గుడిపాటిపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పులుకూరి శామ్యూల్ విజయనందం అనే వ్యక్తి కనిగిరికి చెందిన మూలె శ్రీను అను వ్యక్తి నుంచి 6 లక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. దాని తాలూకా వడ్డీతో కలిపి రూ.10 లక్షలకు చెక్కు ఇచ్చాడు. శ్రీను చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. కేసు నాలుగేళ్ల విచారణ జరిగి శుక్రవారం కనిగిరి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి కె.భరత్‌చంద్ర నిందితునికి రూ.10 లక్షల పరిహారం, ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అనంతరం నిందితుడిని జైలుకు తరలించారు.

జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల హాకీ జట్ల ఎంపిక



హాకీ సబ్ జూనియర్ బాలికల జట్టు

సంతనూతలపాడు: రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా సబ్ జూనియర్ హాకీ బాలబాలికల జట్ల ఎంపిక శుక్రవారం మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగింది. జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపిక ప్రక్రియను జిల్లా కార్యదర్శి సుందరరామిరెడ్డి ఆధ్వర్యంలో చంద్రశేఖర్, రవి, మాధవరావు, రవికుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాకీ క్లబ్ మైనంపాడు అధ్యక్షుడు గొడుగు కాలేశా, హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం ఓబుల్, స్కూల్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, హాకీ క్లబ్ మైనంపాడు వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ వెంకటేశ్వర్లు, రామారావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారని హైస్కూల్ పీఈటీ తిరుమలశెట్టి రవికుమార్ తెలిపారు. ఎంపికైన బాలుర జట్టు ఈ నెల 17 నుంచి 19 వరకు మదనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుంది. బాలికల జట్టు ఈ నెల 27 నుంచి 29 వరకు అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రకాశం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనుంది.



హాకీ సబ్ జూనియర్ బాలుర జట్టు

పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్ ఇవ్వాలి

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

ఒంగోలు అర్బన్: గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్‌ను సంబంధిత ఉద్యోగి దివ్యజ్యోతికి కల్పించాలని కోరుతూ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం కన్‌స్ట్రక్షన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ అబుతలీంను కోరారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో ఎస్‌ఈని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పెండింగ్ ఉన్న ప్రమోషన్‌పై ఎస్‌ఈ స్పందిస్తూ పండగ సెలవుల తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంఘ నాయకులు పి.వరకుమార్, ఈదర విజయభాను, ఈదర శ్రీనివాసరావు, యేసురత్నం, మన్నం చెంచరావు, సుమతి, ప్రసన్నకుమారి, శ్రీనివాసులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

త్రిపురాంతకం: మండల కేంద్రం త్రిపురాంతకం రాధాస్వామి సత్సంగం సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఓ బాలుడు మరుగుదొడ్డికి వెళ్లేందుకు రాధాస్వామి సత్సంగం సమీపంలో ఉన్న చిల్ల చెట్ల వైపు వెళ్లాడు. అక్కడ ఎదురుగా ఉన్న చెట్లలో మృతదేహాన్ని గమనించి 100 ఫోన్ చేసి సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అస్సాన్, ఎస్‌ఐ శివబసవరాజులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతుడు నీలిరంగు, ఎర్ర గడుల చొక్కా, నల్ల నిక్కరు ధరించి ఉన్నాడు. పొడవాటి వెంట్రుకలు, గడ్డం కలిగి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఎర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

భక్తిశ్రద్ధలతో ముస్లింల ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

ఒంగోలు టౌన్: నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీ ఆవరణలో నిర్వహిస్తున్న తబ్లిగీ ఇస్తిమాకు ఒంగోలు, నెల్లూరు జిల్లాల నుంచి ముస్లింలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రెండో రోజు శుక్రవారం కావడంతో జమాయత్‌తో కలిసి నమాజ్ చదవాలన్న ఉద్దేశంతో పెద్ద సంఖ్యలో ముస్లింలు ఇస్తిమా ప్రాంతానికి చేరుకోవడంతో 25 ఎకరాల ఐటీఐ కాలేజీ ప్రాంగణం కిటకిటలాడింది. దీంతో త్రోవగుంట వైపు వెళ్లే దారులన్నీ రద్దీగా మారాయి. ఇస్తిమాకు దేవ్‌బంద్, హైదరాబాద్, విజయవాడ నుంచి ముస్లిం మత పెద్దలు తరలివచ్చి ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. జుమా నమాజ్ అనంతరం దువా నిర్వహించారు. దేశ ప్రజలందరికీ సుఖ శాంతులు ప్రసాదించాలని, ప్రజల మధ్య సోదర భావాన్ని పెంపొందించాలని దువాలో అల్లాను వేడుకున్నారు.

నేలపాలు



రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడిన ట్యాంకర్

ముండ్లమూరు (దర్శి): మిల్క్ ట్యాంకర్ బోల్తా పడి రూ.3 లక్షల విలువైన పాలు నేలపాలైన సంఘటన మండలంలోని వేంపాడు సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సంగం డెయిరీకి చెందిన పాల ట్యాంకర్ కనిగిరి ప్రాంతం నుంచి గుంటూరు వైపునకు వెళ్తోంది. వేంపాడు వద్ద ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని క్రాస్ చేయబోయి ట్యాంకర్ సైడ్ కాలువలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాలువలా టాంకర్‌లో పాలు ప్రవహించాయి. అనంతరం క్రేన్‌తో పాల టాంకర్‌ను పైకి ఎత్తారు. ట్యాంకర్ బోల్తా పడటంతో అక్కడకు భారీగా జనాలు చేరుకున్నారు. గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం జరిగింది. సుమారు రూ.3 లక్షల విలువైన పాలు నేలపాలైనట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచి భర్త దుర్మరణం

తాళ్లూరు: రోడ్డు ప్రమాదంలో మేజర్ పంచాయతీ తూర్పు గంగవరం సర్పంచి చాట్ల నాగమణి భర్త సుధాకర్(32) దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన చీమకుర్తి మండలం పల్లామల్లి సమీపంలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు.. సుధాకర్ ఒంగోలులో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజూ బైకుపై ఒంగోలు వెళ్లి రాత్రికి ఇంటికి వస్తాడు. ఈ క్రమంలో విధులకు వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తుండగా మార్గమధ్యంలోని పల్లామల్లి వద్ద బైకు చెట్టుకు ఢీకొని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన భార్య నాగమణి తూర్పు గంగవరం మేజర్ పంచాయతీ సర్పంచిగా పని చేస్తున్నారు.

రేషన్ షాపుపై టీడీపీ నేతల దౌర్జన్యం

- బాధిత డీలర్ ఫజులున్ ఆవేదన

కురిచేడు: స్థానిక దర్గావీధిలోని 10వ నంబర్ రేషన్ షాపును టీడీపీ నాయకులు దౌర్జన్యంగా కేసు నమోదు చేయించారని డీలరు షేక్ ఫజులున్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. 13 ఏళ్లుగా ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా నిజాయితీగా రేషన్ షాపు నిర్వహిస్తున్నానని డీలర్ ఫజులున్ తెలిపారు. కొందరు టీడీపీ నాయకులు అద్దదారులతో తన షాపును పొందాలని రెవెన్యూ అధికారులు షాపులో ఉండగానే రేషన్ బియ్యం మూటలు తెచ్చి షాపు ముందు పడేశారని పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీ రాత్రి ఆర్ఐ నాగరాజు, వీఆర్వో నాగరాజులు తన షాప్‌ను తనిఖీ చేయాలని పిలిపించి తాళం తీయించారని, షాపులో స్టాకు సక్రమంగా ఉందని నిర్ధారించుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ప్రమోద్ వస్తున్నారు.. షాపు మూయవద్దని ఆదేశించారని ఆమె వివరించారు. డీటీ వచ్చేలోగా టీడీపీ నాయకులు ఆటోలో రేషన్ బియ్యం తెచ్చి షాపు ముందు రోడ్డుపై వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వచ్చి షాపును తనిఖీ చేసి స్టాకు రికార్డు ప్రకారం సరిపోయిందని నిర్ధారించారు. అనంతరం రోడ్డుపై ఉన్న బియ్యం టిక్కీలు నీవే అంటూ టీడీపీ నాయకులకు వత్తాసుగా తనపై కేసు నమోదు చేశారని తెలిపారు. తనకు ప్రభుత్వ అధికారులు న్యాయం చేయాలని ఆమె కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనరు వైవీ సుబ్బయ్య, సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, ఎంపీటీసీలు కానాల శివారెడ్డి, బుల్లం వెంకట నర్సయ్య, మాజీ ఎంపీపీ మేరువ సుబ్బారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఊట్ల వెంకటేశ్వర్లు, గోగులమూడి లింగారెడ్డి, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నిమ్మకాయల రాజయ్య, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు కండె గంగయ్య, రమణారెడ్డి, నాయబ్ రసూల్, మీరావలి, శ్రీనివాసులు, జానీ పాల్గొన్నారు.


డీలర్‌కు మద్దతు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎక్కువ కెపాసిటర్లతోనే అధిక బిల్లు

- విద్యుత్ ఈఈ నాగేశ్వరరావు

మార్కాపురం: స్మార్ట్ మీటర్లతో అధిక బిల్లులు రావని, వినియోగదారుడు అధిక కెపాసిటర్లు వాడటం మూలంగానే విద్యుత్ బిల్లు ఎక్కువగా వచ్చిందని మార్కాపురం విద్యుత్ శాఖ ఈఈ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ‘సాక్షి’లో ప్రచురితమైన స్మార్ట్ మీటర్ షాక్ కథనానికి ఆయన స్పందించారు. పట్టణంలోని సబ్‌స్టేషన్ సమీపంలో మదీనా వాటర్‌ప్లాంట్ యజమాని కరిముల్లా స్మార్ట్ మీటర్ కారణంగానే అధిక విద్యుత్ బిల్లు వచ్చిందని ఆరోపించగా డీఈ షియా నాయక్‌తో తనిఖీ చేయించినట్లు తెలిపారు. ప్లాంటులో నిర్దేశించిన దానికంటే ఎక్కువగా కెపాసిటర్లు అమర్చుకున్నందున అధిక మొత్తంలో బిల్లు వచ్చినట్లు తాము గుర్తించామన్నారు. వెంటనే కెపాసిటర్లను సరిచేసుకోవాలని సూచించామన్నారు.


స్మార్ట్ మీటర్‌ను తనిఖీ చేస్తున్న డీఈ షియానాయక్

మండల సమావేశం బహిష్కరించిన ఎంపీటీసీలు

యర్రగొండపాలెం: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీటీసీలు బహిష్కరించారు. శుక్రవారం జరగాల్సిన సమావేశానికి ఎంపీడీవోతో పాటు ఆయా శాఖల అధికారులు గైర్హాజర్ కావడంతో అజెండాలోని మొదటి అంశంపై చర్చ జరుగుతున్న సమయంలోనే సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పెద్దదోర్నాల మండలం చెంచు గూడేల్లో సందర్శించేందుకు రావడంతో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని అధికారులు అక్కడికి వెళ్లారు. ఈ కారణంతో మండల పరిషత్ సమావేశానికి వారు హాజరు కాలేక పోయారని ఒక అధికారి తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ, అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన ద్వితీయ శ్రేణి అధికారులు పాల్గొన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అంశాల వారీగా చర్చించేందుకు తాము మండల సమావేశానికి హాజరైతే అధికారులు మాత్రం ఏదో ఒక నెపంతో హాజరు కావడం లేదని వైస్ ఎంపీపీ మందుల ఆదిశేషగిరిరావు ఆరోపించారు. మండల సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించకుండా ఎంపీపీడీవో మంత్రి దర్శనం కోసం వెళ్లడమేమిటని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ హాజరవుతున్నారన్న భయంతో అధికారులు ముఖం చాటేసి ఉంటారని ఆయన వ్యగ్యంగా అన్నారు. మండల పరిషత్ సమావేశానికి తాను హాజరు కావడం లేదని ఎంపీడీవో తనతో గురువారం ఉదయం చెప్పారని, ఈ సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు సమాచార అందివ్వలేక పోవడంతో వారందరూ తమ తమ ప్రాంతాల్లోని సమస్యలపై చర్చించేందుకు సుదూర ప్రాంతాల నుంచి సమావేశానికి వచ్చారని ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ తెలిపారు. కోరం లేక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా వేయలేదని, సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చే అధికారులు లేకపోవడంతో వారు సమావేశాన్ని బహిష్కరించారని తెలిపారు. మండలంలో 18 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా వారిలో టీడీపీ సభ్యులతో కలుపుకొని 14 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

కులమతాలకు అతీతంగా గంధ మహోత్సవం


ప్రత్యేక పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

తాళ్లూరు: కులమతాలకతీతంగా గంధ మహోత్సవం జరుపుకోవడం సంతోషమని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. మండలంలోని తూర్పు గంగవరంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన శ్రీ హజరత్ నాగూర్ మీరావలి షఫీర్ గంధ మహోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంధ మహోత్సవాన్ని ఏటా పండగలా జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఆదాం షరీఫ్, మైనారిటీ నాయకులు షేక్ మస్తాన్ వలి, షేక్ కరీముల్లా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, చెక్కుల రామకృష్ణారెడ్డి, కటకంశెట్టి శ్రీనివాసరావు, గుజ్జుల తిరుపతిరెడ్డి, గూడ గోపాల్‌రెడ్డి, గువ్వల శ్రీనివాస్‌రెడ్డి, నాగమల్లేశ్వర్‌డ్డి, పి.దేవదానం, షేక్ మహ్మద్ రఫీ, షేక్ యాసిన్, షేక్ ఖాసిం వలి, పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

యర్రగొండపాలెం: త్రిపురాంతకం మండలం దీవెన కాలనీకి సమీపంలో జాతీయ రహదారి దాటుతున్న మహిళకు గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. మధ్యప్రదేశ్‌లోని ఖతి గ్రామం నుంచి శ్రీశైలం వెళ్తున్న ట్రావెల్ బస్సు దీవెన కాలనీ వద్ద ఆగింది. బస్సులో ఉన్న యాత్రికులు మూత్ర విసర్జనకు రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఇందిరా బాయి యాదవ్‌ను ఢీకొంది. ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఆమెను గుంటూరుకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


గాయపడిన ఇందిరాబాయి

మద్యం బాటిళ్ల పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై బసవరాజు

యర్రగొండపాలెం: త్రిపురాంతకం మండలం లేళ్లపల్లిలో అక్రమంగా దాచి ఉంచిన 25 మద్యం క్వార్టర్ బాటిళ్లను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఆ గ్రామానికి చెందిన ఒక దుకాణంలో మద్యం అమ్మకాలు జరుపుతున్నారన్న సమాచారం తెలుసుకున్న ఎస్సై శివబసవరాజు తన సిబ్బందితో దాడులు జరిపారు. నిందితుడిని తమ కస్టడిలోకి తీసుకొని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రకాశం ఖిల్లా

- ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యార్థుల భవితకు బంగారు బాట
- అత్యాధునిక పద్ధతులతో మెరుగైన వైద్య సేవలు

ఒంగోలు అర్బన్: జిల్లాకు పురాతన కాలం నుంచి గొప్ప చరిత్ర ఉంది. మార్కాపురం దేశానికే పలకలు అందించింది. చీరాల చేనేత చీరను నేసిచ్చింది. ఇక్కడి పొగాకు, గెలాక్సీ గ్రానైట్ విదేశాలకు ఎగుమతవుతున్నాయి. ఒంగోలు ఎద్దు రంకెకు విశ్వమే వినమ్రంగా తలవంచింది. ఆదిమ కాలం నుంచి ఈ ఆధునిక కాలం వరకు ఈ ప్రాంతం విద్య, వైద్యం, ఆధ్యాత్మిక రంగాల్లో క్రమంగా ఎంతో అభివృద్ధి సాధించింది. ఒంగోలులో పలు విద్యా సంస్థలతో పాటు, ఆస్పత్రులు ఎన్నో విశేషమైన సేవలందిస్తున్నాయి. విద్యారంగంలో అత్యున్నత విద్యా ప్రమాణాలతో విద్యార్థులను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దుతూ పలు విద్యాసంస్థలు ఉండగా, వైద్య రంగంలో పలు ఆస్పత్రులు అధునాతన సదుపాయాలతో వైద్యసేవలందిస్తున్నాయి. నిష్ణాతులైన వైద్యులు మెరుగైన వైద్యాన్ని ప్రజలకు చేరువ చేశారు.

కోమలి ఫెర్టిలిటీ సెంటర్:
వివిధ కారణాలతో తల్లిదండ్రులు కాలేని దంపతులకు ఆ కష్టం లేకుండా తల్లిదండ్రులు కావాలనే కలను ఒంగోలులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో డాక్టర్ ప్రతిమ కామిశెట్టి ఏర్పాటు చేసిన కోమలి ఫెర్టిలిటీ సెంటర్ నెరవేరుస్తోంది. గత ఒకటిన్నర సంవత్సరాలుగా ఐవీఎఫ్ పద్ధతిలో మెరుగైన సత్ఫలితాలు సాధిస్తోంది. అండాశయ సమస్యలకు చికిత్స చేయడంతో పాటు మగవారిలో ఉన్న సంతాన సాఫల్య సమస్యలకు చికిత్స అందిస్తోంది. ఐయూఐ, ఐవీఎఫ్, ఐసీఎస్ఐ, సరోగసి వంటి అధునాతన పద్ధతులను వినియోగిస్తోంది.

స్నేహ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్:
సుందరయ్య భవన్ రోడ్డులోని స్నేహ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మెరుగైన కంటి వైద్య సేవలు అందిస్తున్నారు. డాక్టర్ సాయిస్నేహ యడ్లపల్లి ఆధ్వర్యంలో అత్యాధునిక కంప్యూటర్ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. స్లిట్‌ల్యాంప్, రెటినా పరీక్షలతో పాటు ఏ స్కాన్ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎటువంటి కట్టులేకుండా కంటి ఆపరేషన్‌లు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

కేర్‌మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల:
కర్నూలు రోడ్డు లంబాడి డొంకలో కేర్‌మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాలలో కట్టుడు, ఫిక్స్‌డ్ సిరామిక్ పళ్లు, ఇంప్లాంటాలజిస్ట్ డాక్టర్ కే వేణుగోపాల్, చిగుళ్ల వ్యాధులకు సంబంధించి ఇంప్లాంటాలజిస్ట్ డాక్టర్ సీహెచ్ హిమశిల్పలు ఎటువంటి దంత, చిగుళ్ల సమస్యలకైనా పూర్తి స్థాయిలో పరిష్కారం చూపుతూ వైద్య సేవలు అందిస్తున్నారు. ఆధునిక వైద్య యంత్రాలను వినియోగిస్తూ మెరుగైన వైద్య సేవలందిస్తున్నారు. ఈ ఆస్పత్రిలో ప్రభుత్వ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు, పెన్షనర్లకు, వర్కింగ్ జర్నలిస్టులకు ఎంప్లాయిస్ స్కీముల ద్వారా నగదు రహిత వైద్య సేవలు అందించడం విశేషం.

గాయత్రి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్:
సుందరయ్య భవన్ రోడ్డులోని గాయత్రి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో ఆర్థో డాక్టర్ ఎన్‌బీ హర్షవర్ధన్ రెడ్డి, పల్మనాలజి డాక్టర్ వీ ప్రత్యూషరెడ్డిల ఆధ్వర్యంలో పలు రకాల వైద్య సేవలు అందిస్తున్నారు. కీళ్లు, నరాలు, వెన్నుపూసలకు సంబంధించి మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ట్రామా, కీళ్ల మార్పిడిలతో పాటు శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. విరిగిన ఎముకలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నారు.


ఒంగోలు నగర వ్యూ

శ్రీమాధవి హాస్పిటల్:
పవర్‌ఆఫీస్ ఎదురుగా ఉన్న ఎన్‌జీఓ కాలనీలో ఉన్న శ్రీమాధవి హాస్పిటల్‌లో డాక్టర్ దుగ్గి బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మెరుగైన వైద్యసేవలు ప్రజలకు అందిస్తున్నారు. విషజ్వరాలు, నెమ్ము, ఊపిరితిత్తులు, కిడ్నీ వ్యాధులతో పాటు పాము కాటు, తేలు కాటులకు సంబంధించి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

అరవింద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్:
అదే ఎన్‌జీఓ కాలనీలో ఉన్న అరవింద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో డాక్టర్ మందలపు నరేంద్రబాబు ఆధ్వర్యంలో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో పాటు పల్మనాలజీ విభాగంలో డాక్టర్ భానుతేజ వైద్య సేవలు అందిస్తున్నారు.

ఏషియన్ హాస్పిటల్స్:
సుందరయ్య భవన్ రోడ్డులోని ఏషియన్ హాస్పిటల్స్‌లో న్యూరో సర్జన్ డాక్టర్ రాజశేఖర్ బొడ్డపాటి ఆధ్వర్యంలో నరాల వైద్య సేవలు అందిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో తలకు దెబ్బలు తగిన వారికి విజయవంతంగా ఆపరేషన్‌లు నిర్వహిస్తూ ప్రాణాలు కాపాడుతున్నారు. డాక్టర్ మన్నె మానస ఆధ్వర్యంలో గ్యాస్ట్రబుల్, లివర్, ప్యాంక్రియాసిస్ సంబంధిత వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు.

కేరళ మసాజ్ పెయిన్ అండ్ రిలాక్సేషన్ థెరపీ కేంద్రం:
ప్రకృతి వైద్యంపై ఇప్పుడిప్పుడే ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో ఒంగోలులో ఏర్పాటు చేసిన కేరళ మసాజ్ పెయిన్ అండ్ రిలాక్సేషన్ థెరపీ కేంద్రం పలు సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. కేరళ ఆయిల్ మసాజ్, మడ్ మసాజ్, ఫుల్‌బాడీ మసాజ్, స్టీమ్ బాత్ వంటి సేవలు అందుబాటులోకి తీసుకొచ్చి అందిస్తున్నారు.

క్విస్ విద్యా సంస్థలు:
ఒంగోలులో 1997లో నిడమానూరి ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించిన డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి క్విస్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌ల ద్వారా విద్యా రంగంలో సేవలు అందిస్తున్నారు. దీంతో మెరుగైన విద్యను అందించడంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నారు. క్విస్ ఇంజినీరింగ్ కాలేజి టెక్నాలజీ రంగంలో విద్యార్థులు రాణించేలా ప్రత్యేక కార్యక్రమాలు, ప్రస్తుత పోటీని తట్టుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దడంలో విశేష కృషి చేస్తోంది. జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలో జిల్లాలో అటానమస్ హోదా పొందిన మొట్టమొదటి ఇంజినీరింగ్ కాలేజిగా క్విస్ పేరుతెచ్చుకుంది. క్విస్ కాలేజి ఆఫ్ ఫార్మసీ ద్వారా వైద్య రంగానికి సంబంధించి విద్యను అందిస్తోంది. అధునాతన ల్యాబ్‌లు, మెడిసినల్ గార్డెన్, ప్రాజెక్టు గదులు, డ్రగ్ సమాచార కేంద్రం, యానిమల్ రూమ్‌ల వంటి అత్యాధునిక వసతులతో విద్యను అందిస్తోంది. బీ ఫార్మసి, ఫార్మ డీ, ఎంఫార్మసీ కోర్సులు అందిస్తోంది.

ఫెర్టికేర్ ఐవీఎఫ్ సెంటర్:
ఒంగోలులోని పండరీపురం బైపాస్ రోడ్డులో ఉన్న ఫెర్టికేర్ ఐవీఎఫ్ సెంటర్ ద్వారా మూడేళ్లుగా ప్రజలకు అత్యున్నత సేవలందిస్తూ సంతానం లేని వారికి వర ప్రసాదినిగా మారింది. ఈ మూడేళ్లలో 700 మందికి పైగా దంపతులకు ఐవీఎఫ్ ద్వారా చికిత్స అందించి సంతాన ప్రాప్తి కల్పించారు. డాక్టర్ శ్రావణిరెడ్డి, డాక్టర్ ఉజ్వల జాస్తిల ఆధ్వర్యంలో విశేష సేవలు అందిస్తున్నారు.

శ్రీసూర్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్:
ఒంగోలు సుందరయ్యభవన్ రోడ్డులోని శ్రీసూర్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో డాక్టర్ కూనం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ద్వారా మెదడు నరాల విభాగంతో పాటు మూత్రపిండాల విభాగం, జనరల్ మెడిసిన్, ఊపిరితిత్తుల విభాగాలు, డయాలసిస్ సేవలు అందిస్తున్నారు.

అపెక్స్ హైస్కూల్:
ఒంగోలులో కే శివకోటిరెడ్డిచే 2010 సంవత్సరంలో స్థాపించిన అపెక్స్ విద్యా సంస్థ ద్వారా విద్యార్థులు పోటీ ప్రపంచంలో విజేతలయ్యేలా విద్యా సేవలు అందిస్తున్నారు. అపెక్స్‌లో చదివిన విద్యార్థులు పలు కేటగిరీల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఎన్నో రాష్ట, దేశ స్థాయిలో అవార్డులు, గుర్తింపు పొందారు. ఐఐటీ, నీట్‌లో ఫౌండేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

హరిహర క్షేత్రం:
చీమకుర్తిలోని హరిహర క్షేత్రం దేవాలయం విశేషంగా ఆకట్టుకుంటోంది. 19 సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఈ క్షేత్రం శిద్దా వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బమ్మ చారిటబుల్ ట్రస్టు తరఫున వారి కుమారులు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి నిర్మించారు. ట్రస్టులో సభ్యులైన సోదరులు శిద్దా వెంకటేశ్వరరావు, శిద్దా వెంకట్రావు, శిద్దా సుబ్బారావు, శిద్దా పాండురంగారావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావుల ఆధ్వర్యంలో ఐదేళ్లపాటు శ్రమించి నిర్మించారు ఈ హరిహర క్షేత్రం. ఆలయ ప్రాంగణంలో అయ్యప్పస్వామి, వేంకటేశ్వరస్వామి, వాసవీ కన్యకాపరమేశ్వరి, నగరేశ్వరస్వామి, ఆంజనేయస్వామిలకు ఒక్కొక్క దేవాలయం నిర్మించారు. ఈ హరిహర క్షేత్రం జిల్లాల్లో ప్రసిద్ధి చెందింది. చీమకుర్తిలోని కర్నూలు రోడ్డు వెంట ఉన్న ఈ క్షేత్రంలో నిత్యం భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహిస్తుంటారు. ఈ క్షేత్రం భక్తులను విశేషంగా ఆకర్షించి పవిత్ర పుణ్యక్షేత్రంగా భాసిల్లితుందని భక్తజనం విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

ఒంగోలులోని పిల్లల హాస్పిటల్:
ఒంగోలులోని ఎస్పీ ఆఫీస్ ఎదురుగా ఒంగోలు పిల్లల వైద్యశాలలో డాక్టర్ జి.మృదుల మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో పురిటి పిల్లలకు కార్పొరేట్ స్థాయి అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. నెలలు నిండక ముందే పుట్టిన పిల్లలకు మెరుగైన వైద్యం, పుట్టిన వెంటనే మెదడుకు ఆక్సిజన్ అందక ఏడవని పిల్లలకు ఇచ్చే హైపోథెర్మియా (బ్రెయిన్ కూలింగ్)లో ప్రత్యేక వైద్యం చేస్తున్నామని తెలిపారు.